సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం, 3, డిసెంబర్, 2024



డొంకరాయిలో పోలిపాడ్యమి పూజలు



చిలకలమామిడి గెడ్డలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఆధ్యాత్మిక సౌరభం

కార్తీకానికి వీడ్కోలు.. మార్గశిరానికి స్వాగతం పలుకుతూ జిల్లా అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పోలిపాడ్యమిని పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజామున నదులు, చెరువుల్లో దీపాలను వదిలిన భక్తులు శివాలయాల్లోను ప్రత్యేక పూజలు జరిపారు. బొర్రా గుహలు,కాశీపట్నం,అరకులోయ,మత్స్యగుండం,పాడేరు,చింతపల్లి ప్రాంతాల్లోని శివాలయాల్లో పూజలు నిర్వహించారు. పాడేరుకు సమీపంలోని చిలకలమామిడి,కుమ్మరిపుట్టు,మత్స్యగుండం సెలఏరుల్లో మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో దీపాలు వదిలారు. రంప భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయం, మద్దివీడు భ్రమరాంబికాసమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, రంపచోడవరం సంత మార్కెట్ ఆలయం, ఐ.పోలవరం టీటీడీ శ్రీవారి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పూజలు చేశారు. రంపచోడవరం గౌరీ సంఘం అధ్యక్షుడు సూరిశెట్టి కృష్ణ ఆధ్వర్యంలో గౌరీదేవి సంబరం నిర్వహించారు. ధర్మప్రచార భక్త మండలి సమన్వయకర్త నల్లమిల్లి వెంకట రామారెడ్డి పాల్గొన్నారు.వై రామవరం మండలం డొంకరాయిలో పోలి పాడ్యమి పూజలు పెద్ద ఎత్తున నిర్వహించారు. సీలేరు నది తీరాన భక్తులు పూజలు చేసి, అరటి డొప్పల్లో దీపాలను వదిలారు.

– సాక్షి,పాడేరు/రంపచోడవరం/రాజవొమ్మంగి/మోతుగూడెం

ఘనంగా పోలిపాడ్యమి పూజలు



ఏరులో వదిలిన దీపాలు





చిలకలమామిడి గెడ్డలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



శివాలయంలో భక్తుల పూజలు



రంపచోడవరంలో గౌరీ సంఘం ఆధ్వర్యంలో సంబరం

న్యూస్‌రీల్

గిరిజన విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



తురకలవలస పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పెదబయలు: ప్రతిగిరిజన విద్యార్థి ఉన్నతంగా చదువుకుని పారిశ్రామిక వేత్తగా ఎదగాలని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ అన్నారు. మండలంలోని తురకలవలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల,పెదబయలు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న 'కెరీర్ గైడెన్స్ మార్గదర్శిని' శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవ తరగతి తరువాత ఇంటర్‌లో ఎంపిక చేసుకోవలసిన కోర్సుల గురించి తెలియజేశారు. డిగ్రీతో ఏయే ఉపాధి అవకాశాలు పొందవచ్చో వివరించారు. ఆసక్తి ఉన్న రంగాలను విద్యార్థులు ఎంచుకోవాలని సూచించారు.గిరిజన విద్యార్థులందరూ కనీసం డిగ్రీ వరకు చదువుకోవాలని తెలిపారు. ముందుగా డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఎల్.రజని,ఏటీడబ్ల్యూవో కె.వెంకటరమణ, ఏఈవో పుష్ప జోసెఫ్, మార్గదర్శిని శిక్షకులు,ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, గంగాబాయ్ పాల్గొన్నారు.

ఇద్దరు వైద్యుల సస్పెన్షన్

రంపచోడవరం: విధులకు సక్రమంగా హాజరు కాని వై.రామవరం మండలం గుర్తేడు పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులను సస్పెండ్ చేసినట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. గుర్తేడు పీహెచ్‌సీ వైద్యులు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని సర్పంచ్ గొర్లె దుష్యంతుడు చేసిన ఫిర్యాదు మేరకు వైద్యులు జగదీష్ నాయక్, రాజేష్‌లను సస్పెండ్ చేసినట్టు పేర్కొన్నారు. పీహెచ్‌సీల్లో వైద్య సేవలు పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని పీవో హెచ్చరించారు.

యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం



మహేశ్వరరావు



కన్నయ్య

డుంబ్రిగుడ: యూటీఎఫ్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం అరకులోయలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కె.కృష్ణ, గౌరవ అధ్యక్షులుగా పి.కృష్ణయ్య, సహఅధ్యక్షులుగా టి.చిట్టిబాబు, ఎం.కవిత, కోశాధికారిగా జి.విశ్వరాజు, కార్యదర్శులుగా కె.ఆదిరెడ్డి,ఎం.ధర్మారావు, సోడే నాగేశ్వరరావు, పుడిగి దేముడు, జి.తేజోరావు, కె.సూరిబాబు, ఎం.రమేష్‌బాబు, ఎస్.కన్నయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా యు.వి.నారాయణ, సభ్యులుగా పి.మంగరాజు,కె.రఘునాథ్, డి.వి.వి. సత్యనారాయణ, ఎల్.నారాయణ, రాష్ట్ర కౌన్సిలర్స్‌గా వై.విల్సన్, ఎల్.రుక్మిణి ఎన్నికయ్యారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులకు యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు శెట్టి. బాలకష్ణ, రాజారావు తదితరులు అభినందనలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పద్ధతి మార్చుకోవాలి

- జేఏసీ మండల కన్వీనర్ గోపాల్



గోపాల్

అరకులోయటౌన్: పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తన పద్ధతి మార్చుకోవాలని, గిరిజనేతర వర్తక సంఘం వారితో చేతులు కలిపి గిరిజన ప్రాంతంలో అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదని జేఏసీ మండల కన్వీనర్ గోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. 5వ షెడ్యూల్ ఏరియాలో ఆదివాసీ హక్కులు, 1/70 భూబదలాయంపు చట్టాన్ని తుంగలో తొక్కి రాజకీయ ప్రయోజనాలకోసం పాకులాడుతున్న ఆమెను రాజకీయంగా సమాధి చేసేందుకు జేఏసీ సిద్ధంగా ఉందన్నారు. పాడేరులో ఎన్‌హెచ్ –516 పనుల కోసం సర్వే చేపడితే గిరిజనేతర వ్యాపారుల వాణిజ్య సముదాయాన్ని కాపాడేందుకు గిరిజనేతరుడైన గోవింద్ మాస్టర్‌తో కలిసి మంతనాలు చేయడం ఎంత వరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. గిడ్డి ఈశ్వరికి వత్తాసు పలుకుతున్న గిరిజనేతరులను ఈ ప్రాంతం నుంచి తరిమి కొట్టాలని పేర్కొన్నారు.

అమ్మో పులి



కినపర్తి శివారున పులి దాడిలో మరణించిన మేక

- రెండు గ్రామాల్లో మేకలపై దాడి
- భయాందోళన చెందుతున్న ప్రజలు

రాజవొమ్మంగి/అడ్డతీగల: జిల్లాలోని రెండు మండలాల్లో పులి సంచారం ప్రజలను భయపెడుతోంది. రాజవొమ్మంగి దోనెలపాలెం, అడ్డతీగల మండలం కినపర్తి శివారున అటవీ ప్రాంతానికి సమీపంలో పులి రెండు మేకలపై దాడిచేసినట్టు స్థానికులు చెబుతున్నారు. అటవీ శాఖ అధికారులకు గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో వారు ఆ ప్రాంతాలను సందర్శించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా రాజవొమ్మంగి మండలం గొబ్బిలిమడుగు గ్రామంలో సోమవారం పులి సంచరించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గ్రామ సర్పంచ్ సవిరెల చంద్రుడు, బూసరి రమణ, కేళిల సూరిబాబు తదితరులు గొబ్బిలమడుగు నుంచి బైక్‌లపై జడ్డంగి వెళుతుండగా ఘాట్ రోడ్డు వద్ద పులి కనిపించింది. ఈ విషయాన్ని వెంటనే అటవీశాఖ అధికారులకు తెలియజేశామని, అయితే చీకటి పడిపోతుండడంతో మంగళవారం దర్యాప్తు చేస్తామని చెప్పినట్టు సర్పంచ్ చంద్రుడు తెలిపారు. కాగా తమ గ్రామానికి చెందిన కొంతమంది జడ్డంగి వైపు వెళుతుండగా ఘాట్ రోడ్డు మలుపు వద్ద సోమవారం మూడు సార్లు పులి కనిపించడంతో భయకంపితులయ్యారన్నారు. పులి అడుగుజాడలు చూసి తమ గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారని సర్పంచ్ చంద్రుడు తెలిపారు.





గొబ్బలిమగుడు ఘాట్ రోడ్డులో కనిపించిన పులి పాద ముద్రలు

గిరిజనుడికి పాముకాటు

- మూడు కిలోమీటర్ల మేర డోలీ మోత
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

పాడేరు: పాముకాటుకు గురైన ఓ గిరిజనుడిని రహదారి సౌకర్యం లేకపోవడంతో డోలీ కట్టి ఆస్పత్రికి తరలించారు. సకాలంలో వైద్యం అందకపోవడంతో మృతి చెందాడు. వివరాలివి.. పాడేరు మండలం మారుమూల ఐనాడ పంచాయతీ తొలుగూరు గ్రామానికి చెందిన వంతాల రాంబాబు అనే గిరిజనుడు ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాము కాటుకు గురయ్యాడు. రాత్రి కావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు వీలు పడలేదు. దీంతో సోమవారం ఉదయం రాంబాబుకు కుటుంబ సభ్యులు డోలీ కట్టారు. ఇటీవలే గ్రామానికి మట్టి రోడ్డు నిర్మించారు. కానీ వర్షం కారణంగా రోడ్డు బురదమయం కావడంతో అంబులెన్స్ వెళ్లడానికి వీలు కాలేదు. సుమారు మూడు కిలోమీటర్ల మేర నేరళ్ళ వరకు డోలీలో మోశారు. అక్కడి నుండి ఈదులపాలెం పీహెచ్‌సీకు తరలించి వైద్య సేవలందించారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో అదే అంబులెన్స్‌లో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి తరలించిన కొద్దిసేపటికే అతడు మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తీసుకువెళ్లారు.



పాముకాటుకు గురైన గిరిజనుడిని డోలీలో తరలిస్తున్న కుటుంబ సభ్యులు

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

చింతపల్లి: జిల్లాలో ఇటీవల వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదుగా గతనెల 29వ తేదీ నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మరో వైపు పొగమంచు తీవ్రంగా కురుస్తోంది. సోమవారం అనంతగిరిలో 18.8 డిగ్రీలు, అరుకువేలిలో 19.1, జి.మాడుగులలో 19.2 ,డుంబ్రిగుడలో 19.3, చింతపల్లిలో 19.8 , జీకే వీధిలో 20.1, పాడేరులో 20.2 డిగ్రీలు, ముంచింగిపుట్టులో 20.5 డిగ్రీలు నమోదు కాగా, కొయ్యూరులో 21.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ మరియు వాతావరణం విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.

మండలాల వారీగా గత నెల 29 నుంచి ఈనెల 2వ తేదీ వరకు నమోదైన ఉష్ణోగ్రత వివరాలు డిగ్రీల్లో..

మండలం	గతనెల 29	గతనెల 30	1వతేదీ	2వ తేదీ
చింతపల్లి	16.5	18.5	19.4	19.8
పాడేరు	16.1	19.1	20.0	20.0
అరకులోయ	15.0	17.7	19.4	19.1
అనంతగిరి	17.9	19.3	19.0	18.8
జి.మాడుగుల	16.9	18.3	19.2	19.2

రంగురాళ్ల తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు



రంగురాళ్ల క్వారీని పరిశీలిస్తున్న రేంజ్ అధికారి అప్పారావు

చింతపల్లి: అటవీ ప్రాంతంలో నిబంధనలకు వ్యతిరేకంగా రంగురాళ్ల తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని చింతపల్లి రేంజ్ అధికారి బి.అప్పారావు హెచ్చరించారు. జీకే వీధి మండలం దామనాపల్లి పంచాయతీ పరిధిలో గల దొడ్డికొండ గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నట్టు తమకు అందిన సమాచారం మేరకు సోమవారం క్వారీ ప్రాంతాన్ని పరిశీలించినట్టు చెప్పారు. ఎటువంటి తవ్వకాలు చేపట్టకుండా సిబ్బందితో బేస్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. 24 గంటలూ ఈ క్వారీ ప్రాంతంలో గస్తీ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ ప్రాంతంలో రంగురాళ్ల తవ్వకాలకు ప్రోత్సహిస్తున్న వ్యాపారుల వివరాలను ఇప్పటికే సేకరించినట్టు ఆయన తెలిపారు. వారిపై నిఘా ఏర్పాటు చేయనున్నామని, గ్రామంలో అపరిచిత వ్యక్తులు సంచరించినా,తవ్వకాలు జరిపినా వెంటనే సమాచారాన్ని అందించాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

వదలని వాన

- నీట మునుగుతున్న పంటలు
- మరో వైపు చలిగాలుల విజృంభణ



పాడేరు మెయిన్ రోడ్డులో కురుస్తున్న వర్షం

సాక్షి,పాడేరు: ఫెంగల్ తుపాను ప్రభావంతో జిల్లాలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. తెరిపినివ్వని వానతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ముసురు వాతావరణం కొనసాగుతోంది. నాలుగురోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా వరితో పాటు చిరుధాన్యాలు,వాణిజ్య పంటలు తడిసిముద్దవుతున్నాయి. కొన్ని చోట్ల కుండపోతగా వాన కురుస్తోంది. కోతదశలో ఉన్న వరి చేను నుంచి గింజలు నేలరాలుతున్నాయి. కోతకోసి పొలాల్లో ఉంచిన ధాన్యం ,రాగులు మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటను రక్షించుకునేందుకు వారు అష్టకష్టాలు పడుతున్నారు.

చలిగాలుల విజృంభణ

ముసురు కారణంగా చలిగాలులు విజృంభిస్తుండడంతో వృద్ధులు,చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం సమయంలోనూ చలిగాలుల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. గిరిజనులు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు.పాడేరు,అనంతగిరి,లంబసింగి,సప్పర్ల ఘాట్ రోడ్లలో పొగమంచుతో కూడిన వర్షం కురుస్తోంది. పాడేరు మండలంలోని డల్లాపల్లి, మోదాపల్లి, గుర్రగరువు,బూరుగుచట్టు గ్రామాల్లో పొగమంచు తీవ్రత ఎక్కువగా ఉంది.



పాడేరు ఘాట్‌లోని మోదాపల్లిలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

జిల్లాలో వర్షపాతం ఇలా..

అనంతగిరిలో 38.6 మిల్లీమీటర్లు, జి.మాడుగులలో 5.4, వై.రామవరం 4.2, గంగవరం 3.2, పాడేరు 2.8, అడ్డతీగల 2.6, ఎటపాక 2.6, డుంబ్రిగుడ 2.2, అరకులోయ 1.4,దేవీపట్నం 1.4, మారేడుమిల్లి 1.2, రంపచోడవరం 1.2, కొయ్యూరు 1, హుకుంపేట 1, వి.ఆర్.పురం 0.8, గంగవరం 0.6, చింతపల్లి 0.6, జీకే వీధి 0.4,చింతూరు 0.4 మిల్లీమీటర్ల వర్షపాతం సోమవారం నమోదైంది.



సంతారి ప్రాంతంలో నేలవాలిన చోడిపంట

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

- కలెక్టర్ దినేశ్‌కుమార్

చింతపల్లి: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ కలెక్టర్ ఎ.ఎస్.దినేశ్ కుమార్ తెలిపారు. రక్షిత మంచి నీటి పథకాల సంరక్షణకు విలేజ్ వాటర్ శానిటేషన్ కమిటీలను పటిష్టంగా పనిచేయాలని చెప్పారు. ఆయన సోమవారం చింతపల్లి, కొయ్యూరు సరిహద్దు గ్రామాల్లో పర్యటించారు. నవనిర్మాణ సమితి సంస్థ ఆధ్వర్యంలో గొందిపాకల పంచాయతీ పొర్లుబంద, సమగిరి,డౌనూరు పంచాయతీ శివారు గ్రామాలైన నిమ్మలపాలెం, గొప్పవీధి గ్రామాల్లో రూ.14 లక్షలతో నిర్మించిన గ్రావిటీ పథకాలను ఆయన ప్రారంభించారు. ఆయా గ్రామస్తులు గిరిజన సంప్రదాయాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా నవనిర్మాణ సమితి సంస్థ గ్రావిటీ పథకాలు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి పథకాల నిర్మాణానికి కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. గిరిజన గ్రామాల్లో రోడ్ల సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఎంపీడీవో ఎస్.వి. శ్రీనివాసరావు,ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కల్యాణ్‌రామ్, ఐసీడీఎస్ పీవో రమణి, ఏసీడీపీవో వరలక్ష్మి, సర్పంచ్ సాగిన వరలక్ష్మి, ఎంపీటీసీ మొహనరావు తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

ఏ హోదాలో 'గిడ్డి 'సమీక్షలు ?

- మొన్న జి.మాడుగులలో, నేడు పాడేరులో అధికారులతో సమావేశాలు
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఈశ్వరి తీరుపై గిరిజన సంఘాల ఆగ్రహం



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరు : తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అధికారులతో సమీక్షలు చేస్తుండడంతో అటు ప్రజలు, ఇటు ఉద్యోగులు, గిరిజన సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏ హోదాతో ఆమె సమీక్షలు చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. గత నెల 30న జి.మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, టీడీపీ పార్టీ నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. తాజాగా సోమవారం పాడేరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం జరిపారు. తాను సమావేశానికి వస్తున్నానని, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఒక రోజు ముందుగానే ఆదేశాలు జారీ చేశారు. సోమవారం జరిగిన సమీక్ష సమావేశంలో వేదికపై నుంచి ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలకు తెలియకుండా ఏ పని, ప్రభుత్వ కార్యక్రమాలు, ఇతర అభివృద్ధి, సంక్షేమ పనులు చేయరాదని, అలా కాదని నిర్వహిస్తే చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరికలు జారీ చేసినట్టు సమాచారం. ప్రభుత్వంలో ఏ పదవీ లేకుండా కేవలం పార్టీ నాయకురాలి హోదాలో హుకుం జారీ చేస్తుండడంతో అధికారులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. కూటమి పార్టీలకు చెందిన ప్రభుత్వంలో ఏ పదవీలేని వంపూరి గంగులయ్య, బొర్రా విజయరాణి, ఎస్వీ రమణమూర్తి కూడా అధికారులు ఆదేశాలిచ్చినట్టు సమాచారం. వారు వేదికపై కూర్చోగా, అధికారులు మాత్రం వేదిక ముందు కూర్చుకున్నారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ జోక్యం చేసుకోవాలని పలువురు కోరారు.



సమీక్ష సమావేశానికి హాజరైన అధికారులు, టీడీపీ నాయకులు

విద్యుత్ చార్జీల పెంపు మోయలేని భారం

- హామీని తుంగలో తొక్కి ప్రజలకు షాక్ ఇచ్చిన చంద్రబాబు
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధుల మండిపాటు

పాడేరు : కరెంట్ చార్జీలు పెంచడం అన్యాయమని, ప్రజలపై మోయలేని భారాన్ని కూటమి ప్రభుత్వం మోపుతోందని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు మండిపడ్డారు. తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మిలతో కలిసి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన చంద్రబాబు ప్రజలను మోసం చేశారని, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కాకముందే భారీగా విద్యుత్ చార్జీలు పెంచడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, హింస పెచ్చురిల్లుతోందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం పట్టని ప్రభుత్వానికి విద్యుత్ చార్జీలను పెంచే హక్కు లేదన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తుందని చెప్పారు. ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రజలపై సుమారు రూ.15,680కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపిందన్నారు. పాలనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, విద్యార్థులు ఇలా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఆందోళనల బాటపడుతున్నారని తెలిపారు. విద్యుత్ చార్జీల పెంపును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేస్తుందని ఆయన తెలిపారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను తాము తీవ్రంగా ఎండగడతామన్నారు. అధికారం చేపట్టిన తరువాత ఆరు నెలల కాలంలో ఏ ఒక్క పథకాన్ని చంద్రబాబు సక్రమంగా అమలు చేయలేదని తెలిపారు. మెగా డీఎస్సీ అంటూ కూటమి నాయకులు నిరుద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు. దగాకోరు పాలనపై తాము పోరాటాలు చేస్తామని చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో పింఛన్ మినహా ఏ ఒక్క సంక్షేమం పథకాన్ని అమలు చేయడం లేదన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలు గ్రహించి కూటమి నాయకులనుగట్టిగా నిలదీయాలని పిలుపునిచ్చారు.మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లడుతూ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు రాష్ట్ర ప్రజలను అన్ని విధాలా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరునెలల కాలంలో ఏకంగా రెండుసార్లు విద్యుత్ చార్జీలను పెంచి సామాన్యుడి నడ్డి విరిచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పనితీరుపై రాష్ట్ర ప్రజలంతా ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కూడా సురేష్‌కుమార్, ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి, లకే రామకృష్ణ పాత్రుడు, కె.నర్సింహమూర్తి, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు డి.వి. రాంబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ కె.సూరిబాబు, మాజీ సర్పంచ్‌లు శరభ సూర్యనారాయణ, ఎం.కన్నపాత్రుడు, పాంగి నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు, చిత్రంలో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సేవ్ వాల్తేరు

విశాఖపట్నం

కేంద్రంగా కొత్త రైల్వే జోన్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో వాల్తేరు డివిజన్ భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంది. కేంద్రం నుంచి వస్తున్న సంకేతాలను బట్టి చూస్తే డివిజన్ విభజన అనివార్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఒక వైపు దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించగా.. మరోవైపు వాల్తేరు డివిజన్ నుంచి మేజర్ భాగాలను విడదీసి రాయగడ డివిజన్‌గా ఏర్పాటుకు చకచకా పనులు జరుగుతున్నాయి. 130 ఏళ్ల చరిత్ర కలిగిన వాల్తేరు డివిజన్‌ను కాపాడాలన్న ప్రజల డిమాండ్‌ను కూటమి ప్రభుత్వం పట్టించుకోక పోవడంపై అందరిలోనూ ఆగ్రహం వ్యక్తమవుతోంది.

- సాక్షి, విశాఖపట్నం

- కొత్త జోన్‌కి టెండర్ల నేపథ్యంలో వాల్తేరు డివిజన్‌పై నీలినీడలు
- రాయగడ, విజయవాడ డివిజన్లలో విలీనం చేయనున్న బోర్డు
- డివిజన్ కొనసాగింపును పట్టించుకోని కూటమి ప్రభుత్వం

వాల్తేరు డివిజన్ తూర్పు కోస్తా రైల్వేకు ప్రధాన ఆదాయ వనరు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీ మేరకు 2019 ఫిబ్రవరి 27న కేంద్ర ప్రభుత్వం విశాఖ కేంద్రంగా దక్షిణకోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రకటనతో ప్రజలు ఆనందించినప్పటికీ.. కేంద్రం తీసుకున్న తదుపరి నిర్ణయంతో ఆ ఆనందం నీరుగారిపోయింది. వాల్తేర్ డివిజన్ ప్రధాన కేంద్రంగా రాయగడను ప్రకటించడం అందర్నీ నిరాశకు గురిచేసింది. వాల్తేరు డివిజన్‌ను రెండు భాగాలుగా విభజించి ఒక భాగాన్ని విజయవాడ డివిజన్‌లోనూ, మరో భాగాన్ని కొత్తగా ఏర్పాటు చేయనున్న రాయగడ డివిజన్‌లో కలుపుతున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం 1,106 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉన్న వాల్తేరు డివిజన్‌లో 541 చదరపు కిలోమీటర్ల భాగాన్ని కొత్తగా ఏర్పాటు చేస్తున్న రాయగడ డివిజన్‌లో, మిగిలిన 565 చదరపు కిలోమీటర్ల భాగాన్ని విజయవాడ డివిజన్‌లో విలీనం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

పట్టించుకోని నేతలు



ఓవైపు జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి ఇటీవలే టెండర్లు ఆహ్వానించారు. టెండర్లు ఖరారు చేసిన రెండేళ్లలో కార్యాలయ నిర్మాణం పూర్తి చేయాలని అందులో పేర్కొన్నారు. ఈ లోగా విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ జోన్ కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది. జోన్ డీపీఆర్‌లోనూ విశాఖ డివిజన్‌ని కొనసాగిస్తే మంచిదని కూడా సూచించారు. వాల్తేరు డివిజన్‌ని కొనసాగించాలంటూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా పలుమార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఎంపీలు కూడా ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తారు. దీనిపై పునరాలోచిస్తామంటూ కేంద్రం డివిజన్ అంశాన్ని హోల్డ్‌లో పెట్టింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాల్తేరు డివిజన్ విభజన అనివార్యమైనట్లు కనిపిస్తోంది. ఎందుకంటే ప్రస్తుత ఎంపీలు ఈ విషయంలో ఎలాంటి చొరవ చూపడం లేదు. ఎంపీలు ఒత్తిడి తెస్తే వాల్తేరు డివిజన్ కొనసాగే అవకాశం ఉన్నా.. వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం గమనార్హం.



వాల్తేరే కీలకం

తూర్పుకోస్తా రైల్వే జోన్‌కు వాల్తేరు డివిజన్ బంగారు బాతుగుడ్డు లాంటిది. జోన్‌లో పరిధిలో అధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టే డివిజన్ ఇదే. ఏటా మూడున్నర కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలు సాగిస్తున్నారు. తూర్పు కోస్తా రైల్వే జోన్ సరకు రవాణా, ఇతరత్రా ఆదాయం ఏటా దాదాపు రూ.15 వేల కోట్లు కాగా.. ఇందులో రూ.7 వేల కోట్లు వాల్తేరు డివిజన్ నుంచే వస్తోంది. సాధారణ టికెట్ల ద్వారా రోజుకు రూ.25 లక్షల ఆదాయం లభిస్తోంది. ఇది భువనేశ్వర్ (రూ.12–14 లక్షలు) కంటే ఎక్కువ. దేశంలోనే సుమారు 300 డీజిల్ ఇంజన్లు ఉన్న అతిపెద్ద లోకోషెడ్, 160 ఇంజన్ ఉండే భారీ ఎలక్ట్రికల్ లోకోషెడ్, విశాలమైన మార్షలింగ్ యార్డు కూడా ఇక్కడే ఉన్నాయి. తూర్పు కోస్తాలోనే ఎక్కువ ప్యాసింజర్, సరకు రవాణా వ్యాగన్ ట్రాఫిక్ కలిగిన డివిజన్‌గా వాల్తేరు నిలుస్తోంది. ఐరెన్ ఓర్ రవాణా జరిగే కేకే లైన్ వంటి ప్రధాన మార్గాల ద్వారా వాల్తేరు డివిజన్‌కు అధిక ఆదాయం వస్తుంది. వాల్తేరు డివిజన్‌ను విభజిస్తే.. ఈ ఆదాయం రాయగడ డివిజన్‌కు సొంతమవుతుంది. అంటే విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే కొత్త తన సింహభాగం ఆదాయాన్ని కోల్పోనుంది.

వాల్తేరు డివిజన్ కొనసాగించాల్సిందే...



“ఎంతో చరిత్ర ఉన్న వాల్తేరు డివిజన్‌ను విడదీయాలనుకోవడం సరి కాదు. ఈ డివిజన్‌కు దేశ రైల్వే చరిత్రలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు రాజీలేని పోరాటం చేయాలి. జోన్ ఎంత సెంటిమెంటో.. డివిజన్ కూడా ఉత్తరాంధ్ర ప్రజలకు అంతే సెంటిమెంట్. యూనియన్లు, వివిధ ప్రజాసంఘాలు కలిసికట్టుగా పోరాటం చేస్తే.. ప్రజలంతా మద్దతునిచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.

– ఎస్.ఈశ్వరరావు, రైలు ఫ్యాన్ అసోసియేషన్ ప్రతినిధి

వెదురు గెడ మాదిరిగా పెరిగిన జొన్న



వెదురు గెడల మాదిరిగా ఎత్తుగా పెరిగిన జొన్న మొక్కలు

చింతూరు: మండలంలోని వేములరాయిలో కొవ్వాసి బొజ్జి అనే గిరిజన రైతు పొలంలో వేసిన జొన్న మొక్కలు వెదురు గెడల మాదిరిగా ఎత్తుగా పెరిగాయి. సాధారణంగా జొన్న మొక్కలు ఐదు అడుగుల నుంచి 12 అడుగుల వరకు పెరుగుతాయి. కాగా బొజ్జి పొలంలోని కొన్ని మొక్కలు మాత్రం 15 అడుగులకు వరకు పెరిగి కంకులు వేశాయి. పశువుల ఎరువు అధికంగా వేయడంతో జొన్న మొక్కలు ఎత్తుగా పెరిగినట్లు రైతు తెలిపాడు.

తప్పని డోలీమోత



డోలిమోతపై రోగిని తీసుకువస్తున్న గ్రామస్తులు

కొయ్యూరు: రహదారి సౌకర్యం లేక జిల్లాలో పలు ప్రాంతాల ప్రజలకు అత్యవసర సమయాల్లో డోలీ మోతలు తప్పడం లేదు. మండలంలో డౌనూరు పంచాయతీ ముట్టుమెట్ట గ్రామానికి చెందిన బోనంగి సీతారాం తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఆస్పత్రికి తరలించేందుకు సోమవారం 108 వాహనానికి కుటుంబ సభ్యులు సమాచారమిచ్చారు. అయితే రహదారి సౌకర్యం లేకపోవడంతో వాహనం గ్రామానికి వచ్చే అవకాశం లేదని, రోగిని బచింత వరకు తీసుకు రావాలని 108 సిబ్బంది సూచించడంతో గ్రామస్తులు సుమారు రెండు కిలోమీటర్లు డోలీలో మోసుకొచ్చారు. అక్కడ నుంచి 108 వాహనంలో డౌనూరు ఆస్పత్రికి తీసుకువచ్చి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రహదారిని నిర్మించాలని అధికారులను కోరుతున్నా స్పందించడం లేదని గ్రామస్తులు వాపోయారు.

570కిలోల గంజాయి పట్టివేత

- ఒకరు అరెస్టు..మరొకరు పరార్
- పట్టుకున్న గంజాయి విలువ రూ.28లక్షలు



పోలిపుట్టు జంక్షన్ వద్ద పట్టుకున్న గంజాయి, నిందితుడితో ఎస్ఐ రామకృష్ణ, పోలీసులు

ముంచంగిపుట్టు : జోలాపుట్టు పంచాయతీ పోలిపుట్టు జంక్షన్ వద్ద సోమవారం ఉదయం అక్రమంగా తరలిస్తున్న 570 కిలోల గంజాయిని పట్టుకున్నట్టు ఎస్ఐ జె.రామకృష్ణ తెలిపారు. ముందస్తు సమాచారంతో పోలీసు సిబ్బందితో పోలిపుట్టు జంక్షన్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఒడిశా వైపు నుంచి బొలెరోతో వస్తున్న వ్యక్తులు పోలీసులను చూసి బొలెరోను వదిలి పారిపోయారని, దీంతో చాకచాక్యంగా వ్యవహరించి ఒకరిని పట్టుకోవడం జరిగిందని తెలిపారు. బొలేరో వాహనం తనిఖీ చేయగా బస్తాల్లో 570 కిలోల గంజాయి పట్టుబడిందని, దీని విలువ రూ.28 లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితుడు ఒడిశా రాష్ట్రం కొర్రాపుట్టు జిల్లా నందపూరు బ్లాక్ బాల్లెల గ్రామ పంచాయతీ కేంద్రానికి చెందిన కొర్రా జగ్గను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. బాల్లెల గ్రామానికి చెందిన మరో నిందితుడు పరారయ్యాడని, త్వరలోనే అతనిని కూడా పట్టుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మణరావు, స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

- తుపానుకు పంట నష్టపోకుండా జాగ్రత్తలు
- పంటక్షేత్రాలను పరిశీలించిన అధికారులు



డౌనూరులో వరి పనలను పరిశీలిస్తున్న ఏవో ఉమాదేవి



డుంబ్రిగుడలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

డుంబ్రిగుడ: సస్యరక్షణతో తుపాను వల్ల వరి పంట నష్టాన్ని కాపాడుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి నీలవేణి అన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయధికారి నందు ఆదేశాల మేరకు సోమవారం ఆమె సిబ్బందితో మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి, వరి రైతులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోసిన వరి పనలను కుప్పలు వేసినప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్ప వేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చున్నారు. కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిచినట్లైతే గింజ మొలకెత్తకుండా ఉండటానికి ఉప్పుద్రావణాన్ని (ప్రతి లీటర్ నీటికి 50 గ్రాములు చొప్పున కల్లు ఉప్పు కలిపిన ద్రావణం) పనలపై పడే విధంగా పిచికారీ చేయాలని సూచించారు. కల్లాల మీద ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్రపరుచుకోవాలన్నారు. నూర్పిన ధాన్యం 2–3 రోజులు ఎండ బెట్టడానికి వీలు కాకపోతే కుప్పలలో గింజ మొలకెత్తి రంగు మారి చెడు వాసన వచ్చినప్పుడు నివారించడానికి ఒక క్వింటా ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి పొగ పెట్టడం వల్ల మొలకెత్తకుండా, చెడిపోకుండా నివారించుకోవచ్చన్నారు. రైతులు మరిన్ని సలహాలు, సూచనలకు వ్యవసాయ కార్యాలయానికి సంప్రదించాలని ఆమె కోరారు. ఆయా పంచాయతీలలో వ్యవసాయ సిబ్బంది రైతులకు సూచనలు చేశారు.

కొయ్యూరు:వర్షంలో తడిసి నీటిలో ఉండిపోయిన వరి పనలను ముందుగా కట్టలుగా కట్టి నిలబెట్టాలని ఏవో ఉమాదేవి సూచించారు. రైతులు ఎంత తొందరగా కట్టలుగా కట్టి పనలను నిలబెడితే అంత మేలు జరుగుతుందని ఆమె కోరారు.ఆమె సోమవారం చిట్టింపాడు, డౌనూరులో క్షేత్రస్థాయిలో పర్యటించి వర్షంలో తడిసిపోయిన వరి పనలు పరిశీలించారు. ఆమె రైతులతో మాట్లాడుతూ వెంటనే పనలను కట్టలుగా చుట్టి నిలబెట్టాలన్నారు. తడిసిన ధాన్యం మొలకెత్త కుండా ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. దీంతో మొలక శాతాన్ని చాలా వరకు నివారించే అవకాశం ఉందన్నారు. పొలంలో నిల్వ ఉన్న వర్షపు నీటిని వెంటనే తొలగించాలని సూచించారు. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు కూడా అందుబాటులోకి వస్తాయన్నారు. వ్యవసాయ సహాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: గిరిజన రైతులు తుపాను నేపథ్యంలో వరికోతలను వాయిదా వేసుకోవాలని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి మధుసూదనరావు అన్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రస్తుతం మన్యం వ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు పడుతున్నాయన్నారు. వరి కోతలను వర్షాలు తగ్గే వరకూ వాయిదా వేసుకోవాలన్నారు. కోసిన వరి పనలను కుప్పలుగా వేసి కవర్లు కప్పి తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలుంటే రైతు సేవా కేంద్రాల సిబ్బంది ద్వారా సమాచారం అందించాలని ఆయన కోరారు.

బైక్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

యలమంచిలి రూరల్: జాతీయ రహదారిపై షేకిళ్లపాలెం కూడలికి సమీపంలో సోమవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనం ఢీకొని ఓగుర్తు తెలియని వ్యక్తి(50) దుర్మరణం చెందాడు. అనకాపల్లి నుంచి తుని వైపు నడిచి వస్తున్న పాదచారుడిని వెనక నుంచి స్కూటీతో వస్తున్న యలమంచిలి పట్టణానికి చెందిన శ్రీను ఢీకొట్టాడు. ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అంబులెన్సులో ఇద్దర్నీ యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం గుర్తు తెలియని వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. స్కూటీ నడుపుతున్న శ్రీను తల, ఇతర శరీర భాగాలకు గాయాలయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు.

గిరిజన సంక్షేమ విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాలి

రంపచోడవరం: గిరిజన సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థులు తరచూ అనారోగ్యాలకు గురవుతున్నారని, పలు మరణాలు సంభవిస్తున్నాయని ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు కె.ఆదిరెడ్డి, అన్నారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాలని కోరుతూ హ్యూమన్ రీసోర్స్ డవలప్‌మెంట్, ఐటీ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ మంత్రికి ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. గిరిజన సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల్లో కొంత మంది విద్యార్థులు సికిల్‌సెల్ ఎనిమీయాతో బాధ పడుతున్నా, ప్రత్యేక డైట్ అందడం లేదన్నారు. రక్తహీనతతో పాటు మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు వల్ల మృత్యువాతకు గురుతున్నారన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. ఈ మేరకు రెగ్యులర్ డీడీని నియమించాలని, ఏటీడబ్ల్యూవోల పర్యవేక్షణ సక్రమంగా లేదన్నారు. ఫలితంగా వార్డెన్లు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి గిరిజన సంక్షేమ వసతిగృహాలు, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

క్రీడాభారతి అవార్డుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

పాడేరు రూరల్(అరకులోయ రూరల్): రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ ఆదేశాల మేరకు చైతన్య కాశ్యప్ ఫౌండేషన్ సహకారంతో క్రీడాభారతి అవార్డు కోసం ఈ నెల 8 నుంచి ఆన్‌లైన్‌లో క్రీడా జ్ఞాన పరీక్ష నిర్వహణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడా అభివృధి అధికారి ఎ జగన్మోహన రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 5 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 12 సంవత్సరాలు పైబడిన క్రీడాకారులు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్ క్రీడా పరీక్షలో ప్రతిభావంతులకు మొదటి బహుమతి రూ.1లక్ష, రెండో బహుమతి రూ.50 వేలు, ఇద్దరికి మూడవ బహుమతి రూ.25వేలు ఆరుగురికి, నాలుగువ బహుమతి రూ.11వేలు 11మందికి అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆటో బోల్తా పడి పలువురికి గాయాలు



గాయపడిన యువతి



చాపగెడ్డ వద్ద అదుపు తప్పి బోల్తాపడిన ఆటో

గూడెంకొత్తవీధి : మండలంలోని చాపగెడ్డ వద్ద ప్రయాణికులతో వస్తున్న ఆటో సోమవారం ప్రమాదానికి గురైంది. జర్రెల నుంచి ఆర్వీనగర్ వారపు సంతకు గిరిజనులు ఆటోలో వస్తుండగా చాపగెడ్డ వద్ద మలుపులో ఒక ఆవు అడ్డుగా వచ్చింది. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో అందులోని ప్రయాణిస్తున్న వారిలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు. వారందరినీ 108లో చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

రైతులకు బీమాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ ఫార్మర్స్ అసిస్టెంట్లు

హుకుంపేట: రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ద్వారా పట్టరైతులు, కౌలు రైతులకు అమలు జరిగే రైతు గుర్తింపు కార్డులను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని మండల అగ్రికల్చర్ ఫార్మర్స్ అసిస్టెంట్లు పాంగి అర్జున్,పాడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని గూడ,ములియపుట్టు, మట్టుజోరు పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో పొలాల వద్ద వెళ్లి గిరిజనులకు స్వదేశ్ సంస్థ ద్వారా ప్రభుత్వం అందించనున్న రైతు గుర్తింపు కార్డులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించే రైతు గుర్తింపు కార్డు ద్వారా పొందే ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గుర్తింపు కార్డ్ పొందడం వలన రైతులకు రూ.5లక్షల వరకు బీమా సౌకర్యంతో పాటు రూ.1లక్షల ఆరోగ్య బీమా వర్తిస్తుందన్నారు. అంతే కాకుండా పాక్షికంగా దివ్యాంగమైన రైతులకు రూ.1లక్ష బీమా లభిస్తుందన్నారు. నిత్యావసర, వ్యవసాయ వస్తువులపై 5 నుంచి 25%, వ్యవసాయ ఉపకరణాలపై రాయితీని పొందవచ్చని, ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ సీదరి సాంబ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలను వేగవంతం చేయాలి

- చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్



టేకులబోరులో ఆశ్రమ పాఠశాల భవనాలను పరిశీలించి ఎంపీడీవోకి సూచనలు ఇస్తున్న పీవో అపూర్వభరత్

కూనవరం: గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న సర్వేలను వేగవంతం చేయాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ అన్నారు. మండల కేంద్రంలోని టేకులబోరులో మూడేళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న ఐటీడీఏ క్వార్టర్స్, ఆశ్రమ పాఠశాల భవనాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్‌పీసీఐ ద్వారా ఆధార్ కార్డు లింక్, హౌస్‌హోల్డ్‌సర్వే జియోట్యాగింగ్ వంటి సర్వేలను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఆశ్రమ పాఠశాల భవనాలు, క్వార్టర్స్ మరమ్మతులు సకాలంలో పూర్తి చేయించాలని ఎంపీడీవో కె.ఆర్. విజయను ఆదేశించారు. ఇవి పూర్తిగానే మండల పరిషత్ కార్యాలయాన్ని ఇక్కడికి తరలించాలని, కార్యదర్శులు, సిబ్బంది క్వార్టర్స్‌లో ఉండాలన్నారు. మిగిలిపోయిన పింఛన్ దారులకు వెంటనే సొమ్ము పంపిణీ చేయాలన్నారు. అనంతరం కోతులగుట్టలో కార్యదర్శులతో సమీక్ష నిర్వహించి వారికి దిశా నిర్దేశం చేశారు.

ఉద్యోగాలను గిరిజనులకే కేటాయించాలని డిమాండ్



మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

అరకులోయ టౌన్: పాడేరు మెడికల్ కళాశాలలో ఖాళీ ఉన్న పోస్టులను గిరిజనులకే కేటాయించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ జిల్లా కార్యదర్శి పి.బాలదేవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో ప్రస్తుతం నియమిస్తున్న నాలుగు రకాల ఉద్యోగాల నియామకంలో గిరిజనేతరులకు కేటాయించిన పోస్టులను తక్షణమే రద్దు చేసి, గిరిజనులేక కేటాయించాలన్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి జీవో నెంబర్–3 ప్రకారం వంద శాతం ఉద్యోగులు గిరిజనులకే నియమించాలన్నారు. మండల అధ్యక్షు, కార్యదర్శులు బుజ్జిబాబు, చిన్నబాబు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

నమో నారసింహా

- ఘనంగా 41 రోజుల శ్రీ నృసింహ దీక్షలు ప్రారంభం
- సుమారు వెయ్యి మందికి శాస్త్రోక్తంగా మాలధారణ
- 12 నుంచి 32 రోజుల దీక్ష ప్రారంభం
- జనవరి 12న దీక్ష విరమణ



వేదికపై అప్పన్నస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీనృసింహ దీక్షలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 41 రోజుల మండల దీక్ష తీసుకునేందుకు సింహగిరికి వచ్చిన సుమారు వెయ్యి మంది దీక్షాధారులకు ఉదయం 8 గంటలకు దేవస్థానం అర్చకులు శాస్త్రోక్తంగా మాలధారణ చేశారు. ఆలయ రాజగోపురం పక్కన మాడవీధిలో ప్రత్యేకంగా వేదిక ఏర్పాటుచేసి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ప్రతిమని ఉంచారు. దేవస్థానం అర్చకులు, అధికారులు ఆలయంలోంచి తులసి మాలలను ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకొచ్చారు. స్వామి చెంతన తులసిమాలలను ఉంచి అర్చకులు విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. దీక్షధారులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. దేవస్థానం బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అందజేశారు. దీక్ష తీసుకున్నవారిలో సింహాచలం ప్రాంతానికి చెందిన చందన పెరుమాళ్ పీఠంకి చెందిన భక్తులు, సింహాద్రి మఠంకి చెందిన భక్తులు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గిరిజనులు, ఒడిశాలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఉన్నారు. దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చందన పెరుమాళ్ల పీఠం గురుస్వామి రాజు, సింహాద్రి మఠం గురుస్వామి సురేంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కాగా ఈనెల 12 నుంచి 32 రోజుల శ్రీ నృసింహ దీక్షలు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. జనవరి 12వ తేదీన దీక్షావిరమణ, శాంతి కల్యాణం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

ఎంవీపీకాలనీ: 71వ రాష్ట్ర స్థాయి సీనియర్ అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌వీ ప్రసాదరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరగనున్న రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్‌నకు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. పురుషుల జట్టుకు మేనేజర్‌గా పి.బాలకృష్ణ, కోచ్‌గా చెతన్య, కెప్టెన్‌గా తేజ వ్యవహరించనుండగా యు.శివ, ఎన్.చిన్నంనాయుడు, పి.ప్రసాద్, ఆర్.రూపేష్, ఎస్.గోవర్ధన్, కె.జై, బి.సందీప్‌కుమార్, జి.అజయ్, ఎస్.పవన్, సహిద్‌మున్నా, పి.నూకరాజు సభ్యులుగా ఎంపికైనట్లు తెలిపారు. మహిళల జట్టుకు మేనేజర్‌గా పోలయ్య, కోచ్‌గా కె.లక్ష్మణరావు, కెప్టెన్‌గా పి.అంజలి వ్యవహరించనుండగా పి.యమున, పి.దివ్య, కె.సంధ్య, పి.ద్రాక్షాయణి, ఐ.మేఘన, వై.కోమలి,పి.మౌనిక, ఈ.కల్యాణి, వై.హారిక, హెచ్.ప్రవళిక, పి.బాలకృష్ణ ఎంపికైనట్లు వెల్లడించారు. పురుషుల జట్టుకు ఏయూ ఇండోర్ స్టేడియంలోను, మహిళల జట్టుకు గాజువాక కబడ్డీ గ్రౌండ్‌లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు అసోసియేషన్ అధ్యక్షుడు, జాయింట్ సెక్రటరీ , ఉపాధ్యక్షుడు తదితరులు అభినందనలు తెలిపారు.

గంజాయి కేసులో నిందితుడికి రిమాండ్

అనకాపల్లి: గతేడాది ఆగస్టులో హైవేపై 280 కేజీల గంజాయిని పట్టుకున్న కేసులో ఆరో నిందితుడు రోలుగుంట మండలం వెన్నగోపాలపురం గ్రామానికి చెందిన ఆర్.రాంబాబును నెహ్రూచౌక్‌లో సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు రాంబాబుపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారన్నారు.